మా భూపరిహార పత్రాలు ఉన్నాయో..లేవో!
పైళ్ల దగ్ధం ఘటనతో ధవళేశ్వరం వచ్చిన పోలవరం పునరావాస బాధితులు 7

రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీ బెటాలియన్



- సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్
- కమాండెంట్‌గా రామకృష్ణ నియామకం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

రాజమహేంద్రవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్‌పీ) బెటాలియన్ స్థాపనకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో కాకినాడ జిల్లా కేంద్రంగా 3వ ఏపీఎస్‌పీ బెటాలియన్‌ని చాలా ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. అయితే జిల్లాల విభజన తర్వాత..అత్యవసర భద్రతల రీత్యా రాజమహేంద్రవరంలో ఏపీఎస్‌పీ బెటాలియన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ బలగమైన సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ ఇక్కడ ఉంది. ఆ స్థావరానికి వెనుక ఉన్న ప్రదేశంలో ఆ మాదిరి రాష్ట్ర దళమైన ఏపీఎస్‌పీ ఏర్పాటుకు ఏపీ సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళగిరిలో ఏపీఎస్‌పీ 6వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా ఉన్న సీపీఏ రామకృష్ణకు రాజమహేంద్రవరంలోని 4వ ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రజా భద్రతకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం రుజువైంది. బెటాలియన్‌లో సుమారు 6 కంపెనీలు ఉంటాయి. ఒక్కో కంపెనీలో 120 మంది వరకూ సుశిక్షితులైన సిపాయిలు ఉంటారు. శాంతి భద్రతలకు విపత్కర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో వారిని వినియోగిస్తారు. కేంద్ర బలగమైన సీఆర్‌పీఎఫ్ ఉన్నా.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలంటే పెద్ద ప్రక్రియ ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ విభాగమైన అంతర్గత భద్రత విభాగానికి లేఖ రాయాలి. వారు పరిస్థితులను అంచనా వేసి అనుమతిస్తారు. ఈలోపు పుణ్య కాలం గడిచిపోతుంది. దీంతో ఆ సిబ్బంది మాదిరిగానే శిక్షణ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వాలు దళాలను ఏర్పాటు చేసుకున్నాయి. వీరు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు సులభంగా ఆదేశాలిచ్చి మోహరించడానికి వీలు కలుగుతుంది. కేంద్ర బలగాల మాదిరిగానే వీరికి అధునాతన ఆయుధాలను రాష్ట్ర ప్రభుత్వం సమాకూరుస్తుంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో ఏపీఎస్‌పీ సేవలు కీలకం కానున్నాయి.



వెలుగుబంద లేఅవుట్‌లో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : కలెక్టర్

రాజానగరం, ఆగస్టు 20 : పేదల కోసం ప్రభుత్వం తలపెట్టిన గృహ నిర్మాణాలను త్వరితగతిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని వెలుగుబంద గ్రామ శివారులో లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహ నిర్మాణ లేఅవుట్‌ను మంగళవారం సందర్శించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. దీంతో గృహ నిర్మాణాలకు సంబంధించిన ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ విన్నవించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్ఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు హౌసింగ్ పీడీ ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకర్రావు, డీఈ సూరిబాబు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పీఎఫ్ కార్యాలయం ఎదుట ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 20 : తమకు కనీస పింఛను మొత్తం ప్రతినెలా రూ.9 వేలు చెల్లించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు మంగళవారం రాజమహేంద్రవరంలోని పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పీఎఫ్ కార్యాలయ అధికారులకు ఒక వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కొండలరావు మాట్లాడుతూ ఆర్టీసీలోని అన్ని కేడర్ల రిటైర్డు ఉద్యోగులకు కనీస పింఛను రూ.1,000లు, గరిష్ట పింఛను రూ.2 వేలు మాత్రమే ఉందని అన్నారు. పెరిగిన కుటుంబ ఖర్చులు, వైద్య సమస్యల కారణంగా రిటైర్డు ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో అర్హులైన పింఛనుదారులకు పింఛను మొత్తం పెంచాలన్నారు. అలాగే ప్రతి ఏటా డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.



చదువుకు.. వయసుతో పనేంటి!

38వ డిగ్రీ పొందిన డాక్టర్ రామారెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 20: మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డికి మరో పేరుంది. అదే నిత్య విద్యార్థి.. ఎందుకంటే ఆయన ప్రస్తుతం 38వ డిగ్రీ అందుకున్నారు. చదువుకు వయసుతో పనిలేదని మరో సారి నిరూపించారు. ఇటీవల ఐఐటీ రూర్కెలాలో సర్టిఫికెట్ ఇన్ బాడీ లాంగ్వేజ్ కోర్సు పూర్తి చేసి 38వ డిగ్రీ అందుకున్నారు.ఈ మేరకు మంగళవారం ప్రకాష్ నగర్‌లోని మానస హాస్పిటల్‌లో అరసం సభ్యులు ఘనంగా సత్కరించారు. అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ డాక్టర్ కర్రి రామారెడ్డి 38 డిగ్రీలు సాధించడం ఎంతో మందికి స్ఫూర్తి అన్నారు. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ నా దైనందిన జీవితంలో ఎప్పటికప్పుడు కొత్తవాటిని నేర్చుకోవడంలో ఒక భాగంగా భావించడమే ఇన్ని డిగ్రీలు చేయడానికి దోహదపడిందన్నారు.అనంతరం పడాల వీరభద్రరావు రచించిన అల్లూరి సీతారామరాజు వాస్తవ గ్రంథాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎస్ఆర్.పృథ్వీ,సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు, టీహెచ్.రమాదేవి, వీవీటీ.సంజీవరావు, మల్లెమొగ్గల గోపాలరావు పాల్గొన్నారు.



కనీస పింఛను పెంచాలని పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

వచ్చే నెల 5 వరకు ఈ-పంట నమోదు

అధికారులతో సమీక్షలో జేసీ చినరాముడు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చినరాముడు

కొవ్వూరు, ఆగస్టు 20 : జిల్లాలో ఈ పంట నమోదు సెప్టెంబరు 5వ తేదీ నాటికి 100 శాతం పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ ఎస్.చినరాముడు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ సంఘాలు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు.ఖరీఫ్ 2024కు సంబంధించి జిల్లాలో ఈ పంట నమోదు 96,571 ఎకరాల్లో పూర్తిచేశారన్నారు.పంట నమోదును ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. జిల్లాలో వ్యవసాయ సాగు విస్తీర్ణం 1,72,494 ఎకరాలు, ఉద్యాన సాగు విస్తీర్ణం 1,37,759 ఎకరాలు ఉందన్నారు. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం 3,10,253 ఎకరాల అన్నారు. ఈ పంట నమోదుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. సాగు ధ్రువీకరణ పత్రాలు అవసరమైన రైతులకు వీఆర్వోలు వెంటనే అందించేలా తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. కెఆర్సీ డిప్యూటీ కలెక్టర్, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 30 వేల హెక్టార్ల భూమిలో పంట సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ఈ నెల 3వ వారంలో జరిగే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనే విధంగా చైతన్యం కల్పించాలన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ కార్యాలయాలకు ఎలుకల మందు చేరవేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పి.విజయభాస్కర్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు, మండల తహశీల్దార్లు రేషన్ దుకాణాలను తనిఖీచేసి నివేదికలు సమర్పించాలన్నారు. అక్రమ నిల్వలు, పీడీఎస్ రైస్ కొనుగోలు చేయకుండా నిఘా పెట్టాలన్నారు.కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి టి.రాధిక,ఉద్యానశాఖాధికారి బి. సుజాత కుమారి, కొవ్వూరు డివిజన్ తహశీల్దార్లు పాల్గొన్నారు.

అంతా.. మా ఇష్టం!



రద్దీగా ఉండే పుష్కరఘాట్, జీజీహెచ్ వద్ద పుష్కర్‌కేఫ్‌లు

నగరంలో అత్యంత రద్దీగా ఉండే కోటిపల్లి బస్టాండ్ సెంటర్, జీజీహెచ్ వద్ద ఏర్పాటు చేసిన పుష్కర కేఫ్‌లు

- గత పాలకుల ఇష్టారాజ్యం
- రద్దీ ప్రాంతాల్లో 4 పుష్కరకేఫ్‌లు
- షాపులకు టెండర్ పిలిస్తే వండర్
- ఒకే ఒక్క టెండర్ నమోదు
- వారికే కట్టబెట్టిన అధికారులు
- ఒక్కో షాపు అద్దె నెలకూ రూ.6250
- ఏడాదికి రూ.75 వేలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- విస్తుపోతున్న వ్యాపారులు
- మాకూ కావాలంటూ డిమాండ్

వడ్డించేవాడు మన వాడైతే..అడ్డేముంటుంది.. అక్రమమైనా సక్రమంగానే సాగిపోతోంది.. రోడ్డు మధ్యలో దుకాణం పెట్టేయవచ్చు.. సాఫీగా వ్యాపారమూ చేసుకోవచ్చు. అయినా అడిగే అధికారీ ఉండడు.. పట్టించుకునే పాలకులు ఉండరు.. గత ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరంలో జరిగిన ఒక ఒప్పందమే అందుకు ఉదాహరణ. నగరంలో నలుదిక్కులా పుష్కరకేఫ్‌లు వెలిశాయి.. రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే వీటిని ఏర్పాటు చేసేశారు.. ఒక్కో షాపునకు నెలకూ అద్దె ఎంతో తెలుసా కేవలం రూ. 6250 మాత్రమే.. ఇంత తక్కువ అద్దెకు అంత రద్దీ ప్రాంతాల్లో షాపులు ఎలా వెలిశాయనేది వైసీపీ పాలకులకే ఎరుక.. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలోనే ఇవి ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో వీటి లెక్కతేల్చనున్నారు.

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20 : రాజమహేంద్రవరం నిత్యం రద్దీగా ఉంటుంది..అడుగు తీసి అడుగు వేయాలన్నా కష్టమే. అంత ట్రాఫిక్ ఉంటుంది.ఎందుకంటే ప్రధాన వాణిజ్య కేంద్రం కావడంతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి జనం వచ్చివెళుతుంటారు. దీంతో నిత్యం రద్దీగానే ఉంటుంది. ప్రతి రోజూ వేలాది మంది వచ్చి వెళుతుంటారు. అటువంటి రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సింది పోయి.. గత పాలకులు ట్రాఫిక్ సమస్యను పెంచారు. నగరంలో నిత్యం రద్దీగా ఉండే కొన్ని ప్రాంతాల్లో గత ప్రజాప్రతినిధి, అధికారులు కలిసి చేసిన అనాలోచిత నిర్ణయాలకు ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. 2023లో అప్పటి ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో కొంత మంది అధికారులు చాలా అతిగా వ్యహరించి నగరంలో సమస్యలకు కారణమయ్యారు.

రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాపులు

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే దానికి ఇదో ఉదాహరణ. ఇప్పటి వరకూ ఎక్కడైనా పాలకులు అడిగితే ఉన్నతాధికారులు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వడం చూశాం. అయితే రాజమహేంద్రవరంలో మాత్రం ఏకంగా రోడ్లు.. ప్రభుత్వ స్థలాలనే తాకట్టు పెట్టేశారు. ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో తెలియదు కానీ కోటిపల్లి బస్టాండ్, తాడితోట జంక్షన్, పుష్కరఘాట్, జీజీహెచ్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాపులకు అనుమతులు ఇచ్చేశారు. ఆయా ప్రాంతాల్లో పుష్కర కేఫ్ పేరుతో నాలుగు షాపులను ఏర్పాటు చేశారు. ఈ షాపులకు నగరపాలక సంస్థ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారోనని జనం విస్తుపోతున్నారు.

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు..

ఉదయం సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతాయి.ఒక బైక్ అడ్డం వస్తే చాలు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. అటువంటి రద్దీ ప్రాంతాల్లో పుష్కర్‌కేఫ్‌లు ఏర్పాటు చేయడం చూసి ఇక్కడెలా సాధ్యమైందని జనంఆశ్చర్యపోతున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఏదైనా సాధ్యమే కదా.అభివృద్ధి పేరుతో చేసిన అక్రమాల్లో ఇదొక ఉదాహరణ.ఈ పుష్కర కేఫ్‌ల కారణంగా ఇప్పుడే ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. 2027లో పుష్కరాలు రాబోతున్నాయి. అప్పటికే ఇవి అడ్డుగా ఇలాగే ఉంటే మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇకనైనా కూటమి నాయకులు కళ్లు తెరవాలి. టెండర్ వండర్‌ను బయటకు లాగి భరతం పట్టాలి. కూటమి నాయకులు దృష్టి పెట్టి అక్రమాలను వెలికితీయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పుష్కరకేఫ్‌లను పరిశీలిస్తా..



ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం. తొలగింపు తప్పదు. పుష్కర కాఫీ స్టాల్స్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతాం. పుష్కరాలకు సంబంధించి విభాగాల వారిగా సబ్ కమిటీ వేశాక చర్యలు ఉంటాయి. నగర అభివృద్ధి ప్రధానం అందుకు యాక్షన్ ప్లాన్ ఉంది.

- కేతన్ గార్గ్, కమిషనర్, రాజమహేంద్రవరం

టెండర్ పిలిస్తే.. ఒక్కటే వచ్చిందట?

ఎవరో కానీ నగరం అంతా ఆక్రమించేయడానికి ప్లాన్ వేశారు. మొత్తం పది చోట్ల షాపులను ఏర్పాటు చేసుకునేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎప్పుడు పిలిచారో.. ఎక్కడ పిలిచారో కానీ ఆన్‌లైన్ టెండర్ పిలిస్తే విచిత్రంగా ఒక్క విజన్ మార్కెటింగ్ ఏజెన్సీ ఏజెన్సీ మాత్రమే టెండర్ వేసింది. ఎటువంటి పోటీ లేకుండా నాలుగు షాపులకు నగరపాలక సంస్థ ఒకే చెప్పేసింది. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయి. దుకాణాలను నిర్మించుకుని వాటిని మూడేళ్ల పాటు ఏడాదికి ఒక్కొక్క దుకాణానికి రూ.75 వేలు లీజు ప్రాతిపదికన చెల్లించేలా ఒప్పందాలు జరిగిపోయాయి. ప్రస్తుతం పుష్కర కేఫ్‌లు ఉన్న కూడళ్లలో షాపులు దొరకడమే గగనం. ఆయా కూడళ్లలో సగటు మార్కెట్ రేటు చూస్తే పుష్కరకేఫ్ విస్తీర్ణం ఉన్న ఒక షాపు నెలకు రూ.లక్ష ఉంటుంది. కానీ నగరపాలక సంస్థ అధికారులు కళ్లు మూసుకున్నారో.. చెవులకు వినబడలేదో ఏమో కానీ ఏడాదికి కేవలం రూ.75 వేలకే లీజుకు ఇచ్చేశారు. అంటే నెలకూ ఎంతో తెలుసా కేవలం రూ.6250. ఈ విషయం తెలియడంతో రద్దీ ప్రాంతాల్లో తాము టెండర్లు వేసుకుంటాం. నగరపాలక సంస్థ షాపులు కేటాయించాలని స్థానిక వ్యాపారులు డిమాండ్ చేయడం గమనార్హం.ఈ దుకాణాలు ఇప్పుడు ఒక్కొక్క దుకాణం నెలకూ రూ.30 వేలు చొప్పున సబ్ లీజుకు ఇచ్చినట్టు తెలిసింది.

ఆక్రమణలు.. భరతం పడతారా!

పట్టణాల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.. ఖాళీ జాగా కనిపిస్తే ఒట్టు రోడ్డయినా వదలడంలేదు.. దర్జాగా ఆక్రమించేస్తున్నారు.. అయినా ఎందుకో మరి అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు.. గతంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించాలంటేనే భయపడేవారు.. ఇప్పుడదేం లేదు.. ప్రభుత్వ స్థలమైనా పక్కా భవనాలు కట్టేస్తున్నారు.. ఇక రాజమహేంద్రవరం వంటి రద్దీ మార్కెట్లలో అయితే మరీ దారుణం. గజం జాగా ఖాళీగా ఉన్నా తెల్లారేసరికి అంతే.. దీంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదు. రాజమహేంద్రవరం కాతేరు రోడ్.. అనపర్తిలోని ప్రధాన రోడ్డు ఇందుకు ఉదాహరణ. ఇకనైనా అధికారులు ఆక్రమణల భరతం పడతారేమో వేచి చూడాల్సిందే!

పేపర్‌మిల్లు రోడ్‌లో నిత్య నరకం!



కాతేరు రోడ్‌లో రెండు బస్‌లు వస్తే ఇరుకైపోయిన రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 20 : రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో మల్లయ్యపేట, పేపరుమిల్లు పెట్రోల్ బంక్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో అటుగా లారీలు, బస్సులు, ఇతర భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. కనీసం కారులోనూ వెళ్లడం కష్టంగానే ఉంది. ముఖ్యంగా ఉదయం సాయంత్రం వేళలో స్కూల్, కాలేజీ బస్సులు, పేపరుమిల్లు లారీలు ఇతర వాహనాలతో రోడ్డు బ్లాక్ అవుతుంది. రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి మీదుగా కొవ్వూరు వైపునకు భారీ వాహనాలకు అనుమతులు నిలుపుదల చేసినప్పటి నుంచి ఆర్‌టీసీ బస్సులు, ఇతర వాహనాలన్నీ పేపరుమిల్లు, కాతేరు రోడ్డు మీదుగా నాల్గో బ్రిడ్జి గుండా విజయవాడ జాతీయ రహదారిపైకి వెళుతున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్‌టీసీ , ప్రైవేట్ బస్సులు అన్ని కాతేరు,పేపరుమిల్లు మీదుగానే రాజమహేంద్రవరంలో ప్రవేశిస్తున్నాయి. కాతేరు నుంచి పేపరుమిల్లు వరకు ఉన్న రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. మల్లయ్యపేట నుంచి పేపరుమిల్లు గేటు వరకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం భారీగా ట్రాఫిక్ నిలుస్తుంది. పేపరుమిల్లు పెట్రోల్ బంక్ సెంటర్ ప్రమాదభరితంగా మారింది. అక్కడ రోడ్డుకు ఇరువైపులా కలప లారీలు నిలుపుదల చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాతేరు -పేపరుమిల్లు రోడ్డులో తరచు ప్రమాదాలు జరుగుతున్నా.. ట్రాఫిక్ జామ్ అవుతున్నా కనీసం ఏ ఒక్కరూ కన్నెత్తి చూడడంలేదు.

అనపర్తిలో రోడ్డునూ వదల్లేదు..



అనపర్తిలో రోడ్డు మధ్యనే ఆక్రమణలు

అనపర్తి, ఆగస్టు 20 : ఖాళీగా కనబడిందా ఆక్రమించెయ్.. ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతున్నా మనకేం పని.. మన వ్యాపారం మనదే.. ప్రస్తుతం అనపర్తి మెయిన్‌రోడ్డులో ఇదే పరిస్థితి. గతంలో పాలకులు అనపర్తి మెయిన్‌రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. స్థానిక ఐఎల్‌టీడీ సౌజన్యంతో సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారుల కోసం సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇదంతా గతంలో జరిగిన ఏర్పాటు..అయితే ప్రస్తుతం అనపర్తి మెయిన్‌రోడ్డులో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సెంటర్ పార్కింగ్ స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించుకుని భారీ దుకాణాలు ఏర్పాటు చేయడంతో పార్కింగ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపులకు వచ్చే కస్టమర్లు సెంటర్ పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం లేక షాపుల ముందే బైక్‌లను పార్కింగ్ చేసుకుని షాపులకు వెళుతున్నారు.దీంతో కనీసం మోటారు సైకిల్ వెళ్లే వీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.చిరు వ్యాపారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మెయిన్‌రోడ్డు వ్యాపారులు సమస్య పరిష్కారంపై చర్చించేందుకు బుధవారం వర్తక సంఘ కల్యాణ మండపంలో సమావేశం కానున్నారు. పార్కింగ్ సమస్యపై చర్చించి అధికారులు,నాయకులకు వివరిస్తామని వ్యాపారులు చెపుతున్నారు.



ఆవిర్భావ వేడుకలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

సమాజాభివృద్ధిలో జేఎన్టీయూకే పాత్ర కీలకం

వర్శిటీ 17వ ఆవిర్భావ వేడుకలో ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావు

- ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం
- ప్రత్యేక అతిథిగా హాజరైన కేఎస్‌పీఎల్ సీఓఓ మెర్ల మురళీధర్

జేఎన్టీయూకే, ఆగస్టు 20: కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ పేరుతో 1946లో ఏర్పడిన జేఎన్టీయూ 2008లో యూనివర్శిటీగా మారిందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ వేడుకలను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అధ్యక్షతన వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ రామ్మోహనరావు, ప్రత్యేక అతిథిగా కేఎస్ పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ హాజరు కాగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ పాల్గొనగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ కళాశాల ఎందరో మేధావులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను దేశానికి అందించి సమాజాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగాను, మాదకద్రవ్యాల రహిత విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్శిటీ అనుబంధ కళాశాలల్లో ప్రతిరోజూ జాతీయ గీతం ఆలపించిన తర్వాతే తరగతులు ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంచేందుకు వర్శిటీ పరిపాలనా భవనం ముందు భారత జాతీయ జెండాతో పాటు ప్రపంచంలోని 197 దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కల్చర్, అర్బన్ ఔట్‌రీచ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేశామన్నారు. దీనిద్వారా వర్శిటీ అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటామన్నారు. మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించి సమాజహితమైన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డును అతిథులు ప్రదానం చేశారు. అనంతరం కృష్ణతేజ మాట్లాడుతూ జీవితంలో ఎదురైన ఓటముల ద్వారా విజయం చేరువవుతుందని, వర్శిటీలో సివిల్ సర్వీసెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వర్శిటీ, అనుబంధ కళాశాలల అధ్యాపకులకు, ప్రిన్సిపాల్స్‌కు, యాజమాన్యాలకు, క్రీడాకారులకు, విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. పూర్వపు వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లను సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, యాజమాన్యాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం చేస్తున్న రామ్మోహనరావు, ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ





ఉత్తమ ప్రతిభా కళాశాల అవార్డుతో ప్రగతి యాజమాన్యం, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ ప్రతిభా ఇనిస్టిట్యూట్ అవార్డు

జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇనిస్టిట్యూట్‌గా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎంపికైందని చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. బెస్ట్ పెర్‌ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డును ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ మేకా సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.నరేష్‌లకు ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ, సీఈ డాక్టర్ వై.జయబాబు, డీన్ రాధికామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్‌కు అప్రిసియేషన్ అవార్డును ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. ప్రిన్సిపాల్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ, పీఆర్వో సాయిబాబు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ
- ఘనంగా ముగిసిన శ్రీప్రకాష్ 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

తుని రూరల్, ఆగస్టు 20: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ కోరారు. మంగళవారం జరిగిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం విద్యే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వేటూరి సుందరరామమూర్తి, సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం ఈ కార్యక్రమానికి ఎంతో వన్నె తెచ్చిందన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్య సాధన చేస్తే వీరంతా భవిష్యత్తులో మంచి గాయకులుగా రాణించగలరనడంలో అతిశయోక్తి లేదన్నారు. అనంతరం శ్రీకృష్ణ తన పాటలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. మరో అతిథి, ప్రముఖ కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ కీబోర్డుపై పలు పాటలు వాయించి అలరించారు. అనంతరం అతిథులు శ్రీకృష్ణ, రవిశేఖర్‌లకు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన 'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీహెచ్ రామతులసి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణకి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్


'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలతో శ్రీకృష్ణ, విజయ్‌ప్రకాష్

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

చింతూరు, ఆగస్టు 20: డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ సభ్యుడు మడివిగంగ లొంగిపోయాడు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మడివిగంగ చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందినవాడు. 2018లో నాటి కుంట ఏరియా మావోయిస్టు కమాండర్ సోడి గజేంద్ర ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా మారాడు. అప్పటి నుంచి 2020 వరకు కుంట ఏరియాలో మిలీషియా సభ్యుడిగా వ్యవహరించాడు. అనంతరం కుంట ఏరియా కమిటీ సభ్యురాలు సోడి మంజుల నేతృత్వంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2021 నుంచి 2023 వరకు కుంట కమిటీ దళ సదాసిగా పని చేశాడు. 2024లో పార్టీ సభ్యుడిగా పదోన్నతి పొంది కుంట ఏరియా కమిటీలో కొనసాగాడు. పార్టీ ఆదేశాల మేరకు రెండు సార్లు పోలీసులపై కాల్పుల్లో పాల్గొన్నాడు. కాలక్రమంలో మావోయిస్టు విధానాలకు విసుగు చెందడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన పునరావాస విధానాలు నచ్చి చివరకు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టు వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

కోనసీమ జిల్లా కలెక్టర్ ఫొటోతో

వాట్సాప్ డీపీ

- గుర్తు తెలియని వ్యక్తి సందేశాలు
- స్పందించవద్దని మహేష్‌కుమార్ విజ్ఞప్తి



అమలాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఫొటోనే వాట్సాప్ డీపీగా పెట్టి సందేశాలు పంపిస్తున్న అపరచితుడి వ్యవహారాన్ని అధికారులు గుర్తించారు. సదరు వాట్సాప్ నుంచి వచ్చే సందేశాలకు ఎవ్వరూ స్పందించవద్దని ఆయన యంత్రాంగానికి, ప్రజలకు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని జిల్లాలోని అధికారులకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. +94785566071 నెంబరుతో ఉన్న వాట్సాప్ ద్వారా అధికారులకు సందేశాలు అందుతున్నాయి. ఈ నెంబరును శ్రీలంక ఫోను నెంబరుగా గుర్తించారు. అయితే ఈ నెంబరు తనది కాదని, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, కాల్స్ కూడా స్వీకరించవద్దని కలెక్టర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారని...

అబ్బాయి కుటుంబీకులపై అమ్మాయి తండ్రి దాడి

పి.గన్నవరం, ఆగస్టు 20: ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారన్న నెపంతో యువ జంటతో పాటు వరుడు తల్లి, చెల్లెలుపై కుమార్తె తండ్రి దాడికి పాల్పడ్డ ఘటన కోడేరులంకలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన కొప్పాడి వరలక్ష్మి, ఆచంట మండలం కోడేరులంకకు చెందిన మెలా రమేష్ నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఈ నెల 18న చర్చిలో వివాహం చేసుకున్నారు. మంగళవారం ఉదయం వారు పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఎస్ఐ బి.శివకృష్ణ ఇరుపక్షాల పెద్దలతో మాట్లాడి పంపించివేశారు. రాత్రి సమయంలో వధువు తండ్రి కొప్పాడి వెంకటరమణ వరుడి ఇంటికి వెళ్లి అప్పుడే ఒప్పంద పత్రాలు రాసుకునే పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన యువ జంటతో పాటు వరుడి తల్లి, సోదరిలపై దాడికి పాల్పడ్డాడు. మాట్లాడే పనివుందని వారిని గదిలోకి పిలిచి తన బొడ్డులో ఉన్న చాకుతో కుమార్తె వరలక్ష్మిని బొటన వేళ్లపై, వరుడు రమేష్‌ను కుడి ఛాతీపై, తల్లి పద్మను వేళ్లపై, సోదరి ఈశ్వరిని బొటన వేలిపై గాయపరిచాడు. క్షతగాత్రులను పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పోలీసులకు సమాచారం అందించి చికిత్స చేయించారు. వధువు వరలక్ష్మి చేతి వేళ్లకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం అమలాపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. దాడి జరిగిన ప్రదేశం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు కావడంతో ఆ మండల పోలీసులకు ఇక్కడి పోలీసులు వివరాలు పంపనున్నట్టు తెలిసింది.


గాయాలపాలైన వధువు వరలక్ష్మి, వరుడు రమేష్



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

జగ్గంపేట, ఆగస్టు 20: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా జగ్గంపేటలోని జేవీఆర్ కాంప్లెక్స్ దాటిన తర్వాత రాజస్థాన్ దాబా వద్ద విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారిపై పల్సర్ మోటారు సైకిలుపై వెళ్తున్న కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొంది. శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో పాటు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని జగ్గంపేట పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భూ సేకరణ కార్యాలయానికి వస్తున్న రైతులు, వారిని అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో)

పోలవరం ప్రాజెక్టు కోసం

భూములు కోల్పోయాం

- వైసీపీ నాయకుల వల్ల నష్టపరిహారం రాలేదు
- మా భూములకు వైసీపీ నాయకులు దొంగ పట్టాలు సృష్టించారు
- అధికారులతో కుమ్మక్కై నష్టపరిహారం కాజేశారు
- పోలవరం భూసేకరణ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన చేసిన గిరిజన, గిరిజనేతర రైతులు

ధవళేశ్వరం, ఆగస్టు 20: పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందలేదని గిరిజన, గిరిజనేతర రైతులు మంగళవారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూ సేకరణ కార్యాలయానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫైల్స్ దగ్ధంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో అధికారులను కలవడానికి వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అందరినీ రైతులుగా గుర్తించి కార్యాలయంలోకి అనుమతించారు. కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్ సరళ వందనంను కలిసి వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ నష్టపరిహారానికి సంబంధించిన పత్రాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల పత్రాలు, ఫైల్స్ భద్రంగానే ఉన్నాయని, త్వరలోనే న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం చినరమణయ్యపేట, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులు డి.శాంతమ్మ, ముళ్ళ సీతాయమ్మ, ముళ్ళ కృష్ణారెడ్డి, పాయం వీరపుదొర, మట్టా రామమూర్తి, మెహర్‌బాబు గౌడ్ తదితర భూములు కోల్పోయిన రైతులు పోలవరం కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం సమాచారంతో తమ వద్ద ఉన్న ఆధారాలతో పోలవరం కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోల్పోయిన భూములకు ఎకరాకు రూ.7.50 లక్షలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. వైసీపీ నాయకులు, సంబంధిత అధికారులు, దళారులు కుమ్మక్కై తమ భూములకు దొంగ డి-పట్టాలు సృష్టించి తమకు అందాల్సిన పరిహారం కాజేశారన్నారు. రెండు సంవత్సరాలుగా ఐటీడీఏ, పోలవరం భూ సేకరణ అధికారులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన చెందారు. భూములు కోల్పోయి, నష్టపరిహారం మరొకరు కాజేయడంతో మనోవేదనతో పలువురు కుటుంబ పెద్దలు మృతి చెందారని వాపోయారు. దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహార సొమ్ములు కాజేసిన వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ అప్పటి అధికారులు తమపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. రాజీకి వస్తే కొంత భూమికైనా నష్టపరిహారం అందుతుందని అధికారులే బెదిరిస్తే తాము ఏమి చేయగలమన్నారు. దొంగ డి- పట్టాలు సృష్టించి సొమ్ములు కాజేసిన విషయమై తమ ఫిర్యాదులపై విచారణ పూర్తిచేసి అసలైన లబ్ధిదారులకు పరిహారం అందజేయాలని సూచించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. రెండు సంవత్సరాలుగా ఈ ఫైల్స్, విచారణ రిపోర్టులు పోలవరం భూసేకరణ కార్యాలయంలోనే ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా భూముల నష్టపరిహారాన్ని దొంగ పట్టాలతో కాజేశారు



డి.శాంతమ్మ, గుబ్బలపాలెం

పోలవరం భూ సేకరణలో మా కుటుంబ సభ్యులకు చెందిన 21ఎకరాల 20సెంట్ల భూమి పోయింది. ఇంతవరకు పరిహారం అందలేదు. దేవీపట్నం మండలం రమణయ్యపేటకు చెందిన వైసీపీ నాయకులు దొంగ పట్టాలు తయారు చేసి అధికారులతో కలిసి మాకు రావాల్సిన నష్టపరిహారం కాజేశారు. అప్పట్నుంచీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంతవరకు న్యాయం జరగలేదు.

అధికారుల చుట్టూ తిరుగుతూ నా భర్త కన్నుమూశాడు

ముళ్ళ సీతాయమ్మ, గుబ్బలపాలెం



పోలవరం భూ సేకరణలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం మాకు అందకుండా కొందరు దొంగ డి-పట్టాలతో కాజేశారు. ఆ సొమ్ముల కోసం అధికారులు చుట్టూ తిరుగుతూ బెంగతోనే నా భర్త కన్నుమూశాడు. అప్పట్నుంచీ నేను, నా కుమారుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంత వరకు పరిహారం రాలేదు.

నష్టపరిహారం అందకపోతే ఆత్మహత్యే శరణ్యం



పాయం వీరపుదొర, గుబ్బలపాలెం

పది ఎకరాల సాగు భూమి కోల్పోయాం. నష్టపరిహారం అందలేదు. భూమినే నమ్ముకుని బతికేవాళ్లం. పరిహారం అందించాలని రెండు సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం.

ఐదెకరాల పరిహారం కాజేశారు

మట్టా రమణమూర్తి, చినరమణయ్యపేట

10 ఎకరాలకు నష్టపరిహారం రావాలి. దీంట్లో ఐదెకరాలకు వైసీపీ నాయకులు అధికారుల సహకారంతో దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహారం కాజేశారు. వైసీపీ నాయకులతో రాజీపడితేనే మిగిలిన భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో పోలవరం భూ సేకరణ కార్యాలయంలో పని చేసిన అధికారి బెదిరించారు.

వైసీపీ నాయకులు, అధికారులు చేసిన తప్పిదాలకు మేం కష్టాలు అనుభవిస్తున్నాం

మెహర్‌బాబా గౌడ్, చినరమణయ్యపేట

10 ఎకరాల భూమితో పాటు ఇల్లు కోల్పోయినందుకు నష్టపరిహారం రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, దళారులకు అధికారులు కొమ్ముకాయడంతో నాకు రావాల్సిన నష్టపరిహారాన్ని కొందరు కాజేశారు. అప్పటి నుంచీ భూసేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అప్పట్లో పని చేసిన భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యకు విన్నవించాం. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్‌కుమార్ గాంధీ మాకు న్యాయం చేయడానికి ఆయన వంతు ప్రయత్నాలు చేశారు. అయినా మాకు రావాల్సిన నష్టపరిహారం ఇంకా అందలేదు.


నష్టపరిహారం కోసం విన్నవించడానికి వచ్చిన చిన రమణయ్యపేట గ్రామ రైతులు

ఏజెన్సీ సమాచారం

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 20: గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక శాఖలు, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజన రైతులకు ఈ-పంట నమోదుతో పాటు పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. 90శాతం సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఏజెన్సీలో పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు వేయాలన్నారు. ప్రతి మండలానికి 25 పశువుల షెడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పంటలు కోతుల బారిన పడకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ డీడీ షరీఫ్, పీహెచ్‌వో చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, మండల వ్యవసాయ శాఖాధికారులు కె.లక్ష్మణ్, విశ్వనాథ్, శాస్త్రవేత్తలు ఆదర్శ, వీరాంజనేయులు, ఎఫ్‌డీవో బాలాజీ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జడ్జి బాబు

పాఠశాలలు, వసతిగృహాల తనిఖీ

రంపచోడవరం, ఆగస్టు 20: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మేజిస్ట్రేట్ పి.బాబు మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, ఐర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తరగతి, హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం లీగల్ సర్వీస్ టోల్‌ఫ్రీ నెంబరు 15100 ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వసతి గదులు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై వుందన్నారు. న్యాయవాదులు వై.శ్రీనివాసరావు, సీహెచ్ సంతోష్‌కుమార్, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

మారేడుమిల్లి: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గిరిజన సంక్షేమ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలను చూసి ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర పీడితులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ బాలురు, బాలికల పాఠశాల, దేవరపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు

వై.రామవరం: నూతన తహసీల్దారు కె.అనసూయ మంగళవారం మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేశారు. పి.యర్ర గొండ ఏకలవ్య పాఠశాల, గురుకుల కళాశాల, యార్లగడ్డ, వై.రామవరంల్లోని ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. మెనూ సక్రమంగా అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో స్టోర్ రూములను చూసి ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తహసీల్దారు వెంట వీఆర్వోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు అనసూయ

దేవీపట్నం: మండలంలోని కొత్తవీధి, ముసినిగుంట హాస్టల్స్‌ను ఎస్‌ఐ నాగార్జున, ట్రైబల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సందర్శించారు. వంటశాలను తనిఖీ చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్, వంట తయారు చేసే విధానాన్ని పరిశీలించారు.



జూనియర్ డాక్టర్‌పై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



మోతుగూడెం, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై పాశవిక దాడిని ఖండిస్తూ డొంకరాయిలో మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఇంజనీర్లు, పవర్‌హౌస్ ఓఎం స్టాఫ్, డిస్ట్రిబ్యూషన్ స్టాఫ్, సివిల్ స్టాఫ్, ఒప్పంద కార్మికులు, డీఏవీ స్కూలు ఉపాధ్యాయులు, ఏపీజీఈఎన్‌సీవో ఆసుపత్రి వైద్యులు, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలం ఆక్రమణ

సిమెంటు స్తంభాలను దగ్గరుండి తొలగింపజేసిన తహసీల్దారు



రాజవొమ్మంగి, ఆగస్టు 20: మండలంలోని దూసరపాము గ్రామ శివారు కింద్ర కూడలి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరువు గట్టును తొలగించి గుర్తు తెలియని వ్యక్తులు భూమిని చదును చేసి దాని చుట్టూ సిమెంటు స్తంభాలు వేశారు. విషయం తెలుసుకున్న రాజవొమ్మంగి ఇన్చార్జి తహసీల్దారు అల్లు సత్యనారాయణ అక్కడకు వచ్చి సిమెంటు స్తంభాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. స్తంభాలను తొలగించే వరకు ఆయన అక్కడే వున్నారు. అనంతరం తహసీల్దారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా చెరువు గట్టును తొలగించిన ఫొటోలను టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో పెట్టారు. వైసీపీ నాయకులే భూ కబ్జాకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



అడ్డతీగల, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

కూనవరం, ఆగస్టు 20: మండలంలో పలుచోట్ల మంగళవారం బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు తక్షణం సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కె.శ్రీనివాస్ కోరారు.

సీతానగరంలో దోమల నివారణ దినం

సీతానగరం, ఆగస్టు 20: ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా సీతానగరం పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని, దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల బయట నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమతెరలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.రాజు, కె.మేఘన, సీహెచ్‌వో పి.వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వై సుబ్బారాయుడు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు

అక్రమాలకు పాల్పడ్డ అధికారులను వదలం

» రెడ్‌బుక్‌లో ఉన్న వాళ్లందరిపై చర్యలు తప్పవు

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20: గత ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ అధికారులను వదిలే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆవ భూముల కుంభకోణంలో డబ్బులెలా చేతులు మారాయనే ఆధారాలు తీసుకుంటున్నామని అన్ని బయటకు వస్తాయన్నారు. దీనిపై హౌస్ కమిటీ వేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారని చెప్పారు. జగన్ చేసిన నేరాల్లో అధికారులను భాగస్వామ్యం చేశాడన్నారు. అప్పుడు అతిచేసి ఇప్పుడు గత ప్రభుత్వ నిర్వాకాలకు ఆధారాలు లేకుండా చేయాలని ఫైళ్లను తగుల బెట్టడం వంటివి చేస్తున్నారని, అటువంటి వారిని వదిలిపెట్టమన్నారు. రెడ్‌బుక్‌లో ఉన్న వాళ్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పదవిలో ఉన్నప్పుడు కనీసం బీసీ వసతిగృహాలను పట్టించుకోని మంత్రి చెల్లుబోయిన వేణు ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. జాంపేట కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్‌ను ఎమ్మెల్యే వాసు అభినందించారు. సమావేశంలో డైరెక్టర్లు ద్వారా పార్వతిసుందరి, బీరా శ్రీనివాస్, పూర్ణిమ ప్రసాద్, జామిశెట్టి గాంధీ, మహంతి లక్ష్మణరావు, జామి కృష్ణ, కనకం నాగేశ్వరరావు(నాని), బూరా రామంచంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేశాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 47వ డివిజన్‌లో మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ, పోలీస్, ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మీ భద్రత-మా బాధ్యత సభకు ఆయన హాజరయ్యారు. గంజాయి, బ్లేడు బ్యాచ్‌ల నిర్మూలనకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో బేసరి చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు భూసేకరణలో భారీ అవినీతి

» ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విచారణ కోరతా

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



మూడు మండలాల తహశీల్దార్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 20: పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో నిర్వహించిన భూసేకరణలో గత ప్రభుత్వ పాలకులు కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రామవరంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి తహశీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం అనపర్తిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 87 ఎకరాల భూమిని సేకరించిందని మార్కెట్ విలువ కంటే ఎకరానికి రూ.17లక్షలు అధికంగా ప్రభుత్వంతో కొనిపించి రూ.14.79 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి విచారణ కోరతానన్నారు. ఎన్నికల ముందు సేకరించిన భూమికి సొమ్ములు చెల్లించకుండానే డమ్మీ పట్టాలు తయారు చేయించి వైసీపీ నేతలు పంపిణీ చేశారని, ఈ అవినీతిలో అప్పటి కలెక్టర్, జేసీతోపాటు అనేక మంది అధికారులు భాగస్వాములుగా ఉన్నారన్నారు. అవినీతి విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రామకృష్ణారెడ్డి అన్నారు.

ఇదిలా ఉండగా దుప్పలపూడిలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ముందుగా గోమాతకు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసి అవసరమైన మందులను రైతులకు అందజేశారు. పాడి రైతులకు పశువుల దాణాను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్వరరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కుంత్యం కాశీవిశ్వేశ్వరరావు, చిర్ల గంగిరెడ్డి, ఎన్వీ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అనపర్తి ఐఎల్‌టీడీ ఆవరణలో ఏర్పాటు చేసిన టీఎన్‌టీయూసీ జెండాను టీడీపీ మండలాధ్యక్షుడు దత్తుడు శ్రీనుతో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించారు. అనేక చోట్ల యాజమాన్యాల తీరుతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి అండగా నిలిచి భరోసా కల్పించాల్సిన బాధ్యత యూనియన్ నాయకులపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లిని ఘనంగా సత్కరించారు.

నేడు జరిగే బంద్‌కు సహకరించండి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20: ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహిస్తున్న బంద్‌కు సహకారం అందించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సమితి నాయకులు మంగళవారం జిల్లా ఎస్పీ, డీఈవో, ఆర్‌టీసీ అధికారి, ప్రైవేట్ కళాశాల అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, ఆటో యూనియన్లు, లారీ, ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్లను కలిశారు.

ప్రభుత్వాసుపత్రికి ఆర్వో ప్లాంట్ బహూకరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వైద్యాధికారి

గోకవరం, ఆగస్టు 20: రోగుల అవసరార్థం ఆర్వో ప్లాంట్‌ను బహూకరించడం అభినందనీయమని ప్రభుత్వ ప్రధాన వైద్యాధికారిణి వనజాకుమారి అన్నారు. గోకవరం ప్రభుత్వాసుపత్రికి సుమారు రూ.40,000 విలువైన ఆర్వో ప్లాంట్‌ను స్థానిక లక్ష్మీసాయి జ్యువెలర్స్ అధినేత పట్నాల నాగేంద్ర మంగళవారం బహూకరించారు. ప్లాంట్‌ను ఆయన సమక్షంలో వనజాకుమారి ప్రారంభించారు. సిబ్బంది, రోగులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

కర్రల డిపోను తక్షణమే తొలగించాలి

రంగంపేట, ఆగస్టు 20: రాజానగరం-బలభద్రపురం రోడ్డులో పల్లకడియం శివారు ఈలకొలను గ్రామం వద్ద నిర్వహిస్తున్న కర్రలు తొక్కతీసే డిపోను తక్షణమే తొలగించాలని గ్రామ కార్యదర్శి సుబ్బారాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పల్లకడియం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కర్రల తొక్కలు తీసే డిపోను ఏర్పాటు చేసి తొక్కలు తీసిన కర్రలను మెయిన్‌రోడ్డుపై వేసి అక్కడే లోడింగ్ చేస్తున్నారన్నారు. దీని వల్ల వాహనదారులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని, అక్కడ రెండు పర్యాయాలు యాక్సిడెంట్‌లు జరిగి పలువురు గాయాలపాలయ్యారని ఈలకొలనుకు చెందిన జనసేన నాయకుడు యెజ్జు సుబ్రహ్మణ్యంనాయుడుకు తెలియజేశామన్నారు. ఆయన స్పందించి తమకు తెలియజేయగా వీఆర్వో పోసికుమార్, రెవెన్యూ సిబ్బందితో వచ్చి పరిశీలించారన్నారు. రెండు రోజుల్లో డిపో ఖాళీ చేయించాలని పల్లకడియం వీఆర్వోకు తెలియజేశామన్నారు.

గోకవరంలో శాంతి ర్యాలీ



గోకవరం, ఆగస్టు 20: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం గోకవరంలో శాంతియుత ర్యాలీ జరిగింది. సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్ నుంచి శివాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో భారతీయులపై జరిగిన హింసాకాండలో 440 మందిని మృతిచెందారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుడదని, కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో గోకవరం, రంపచోడవరం, కోరుకొండ, గంగవరం, దేవీపట్నం తదితర మండలాల ప్రజలు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఘర్షణ.. ఒకరి పరిస్థితి విషమం

సీతానగరం, ఆగస్టు 20: సీతానగరంలోని లంకూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారితీసి కొట్టుకోవడంతో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. లంకూరుకు చెందిన దూళ్ల మహాలక్ష్మయ్య, సోమవారం మధ్యాహ్నం పొలం పనులకు, ప్రసాద్ పశువుల మేపుకు వెళ్లారు. అక్కడ ఇద్దరికి ఘర్షణ తలెత్తి కర్రలతో కొట్టుకున్నారు. దీంతో మహాలక్ష్మయ్య తలపై తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చనిపోయాడనుకుని భయంతో ప్రసాద్ కలుపుమందు తాగాడు. మహాలక్ష్మయ్య కుమారుడితో పాటు కొందరు స్థానికులు చూసి సీతానగరం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆరోజు రాత్రి మహాలక్ష్మయ్య ఇంటికి చేరకపోవడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు లంకభూమిలో గాలించగా లక్ష్మయ్య దుబ్బుల్లో అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో అతడిని సీతానగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి తదుపరి మెరుగైన వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలిచారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయమై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

రైతు బజార్లను తనిఖీ చేసిన జేసీ చినరాముడు



మార్కెట్‌యార్డు రైతు బజార్‌ను పరిశీలిస్తున్న జేసీ చిన రాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 20 : రైతు బజార్లలో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను సరసమైన ధరలకే విక్రయించాలని జేసీ ఎస్.చిన రాముడు అన్నారు. రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ రైతు బజార్, ఆర్ట్స్ కళాశాల, మార్కెట్‌యార్డు రైతు బజార్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలను నియంత్రించడానికి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి రైతుబజార్ల ద్వారా కూరగాయలు, ఇతర సరుకులు విక్రయిస్తున్నామన్నారు. కూరగాయల నాణ్యతను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. రైతు బజార్లలోని రికార్డులను తనిఖీ చేశారు. పౌర సరఫరాలశాఖ ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, డీసీఎస్‌వో పి.విజయభాస్కర్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు రోజియా, కె.శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

చెట్లను పెంచుదాం..ఆరోగ్యాన్ని పంచుదాం ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20: రాజమహేంద్రవరంలో చిరంజీవి బస్టాండ్ వ్యవస్థాపకుడు పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం చెట్లను పెంచుదాం..ఆరోగ్యాన్ని పంచుదాం నినాదంతో ర్యాలీ చేశారు. ఈ నెల 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత చిరంజీవి బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పిల్లలకు అందించారు. విద్యార్థులకు మొక్కలు, దివ్యాంగులకు వీల్‌ఛైర్లు, హియరింగ్ మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీసీ ఎండీ పంతం కొండలరావు, కూటమి నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, వై.శ్రీను, బొమ్ముల దత్తు ,అడబాల రామకృష్ణ, నామని వాసు పాల్గొన్నారు.

త్వరలో నగరపాలక సంస్థ పెట్రోల్ బంకు

కమిషనర్ కేతన్ గార్గ్



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20: రాజమహేంద్రవరం క్వారీసెంటర్ రైతు బజార్ సమీపంలో కార్పొరేషన్ సైట్‌లో త్వరలో బీపీసీఎల్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తుందని కమిషనర్ కేతన్ గార్గ్ చెప్పారు. పెట్రోల్ బంకు ఏర్పాటు చేసే స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ పెట్రోల్ బంకును నిర్మించి నగరపాలక సంస్థకు అప్పగిస్తుందన్నారు.దీని ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుందన్నారు. అనంతరం కమిషనర్ ఏకేసీ కాలేజీ వద్ద నిర్మించిన పార్కును పరిశీలించారు. నగరంలో పార్కుల నిర్వహణను స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇతర దాతలకు అప్పగించే ఆలోచన ఉందన్నారు. ఇందుకోసం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం జరిగిందని.. ఈ కమిటీ నగరంలో పార్కులను నిర్వహించే ఆసక్తి ఉన్న వారిని సంప్రదించి అప్పగించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్‌ఈ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజీ, ఈఈ శేషగిరిరావు, మదర్షా ఆలీ పాల్గొన్నారు.

వైద్యురాలి ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 20: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ రాజమహేంద్రవరం రూరల్‌లో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ,తెలుగు మహిళలు మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని గోరంట్ల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

నన్నయ ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 20: తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు ప్రయత్నించాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు దీక్షారంభ్ పేరుతో ఇండక్షన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగులుగా మాత్రమే కాకుండా గొప్ప ఇంజనీర్లుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుతున్న నాలుగేళ్లు దీక్షగా సాధన చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ నెల24 వరకూ ఇండక్షన్ కార్యక్రమం జరుగుతుందని, ఆఖరి రోజు రాజమహేంద్రవరంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి అవగాహన కల్పిస్తారని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఢిల్లీ వేడుకల్లో జీఎస్ఎల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాజానగరం, ఆగస్టు 20: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో ఇటీవల నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని, తిరిగి వచ్చిన జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.వాణి మాధవి, విద్యార్థులు భాగ్యశ్రీ, సాహిత్ భరద్వాజ్‌లను జీఎస్ఎల్ వైద్య, విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అభినందించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సభలను విజయవంతం చేయాలి

రాజానగరం, ఆగస్టు 20: గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో కొత్త పనుల ప్రతిపాదనకు సంబంధించి ఈ నెల 23న ప్రభుత్వం తలపెట్టిన గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జీపీకేఎస్‌వీ జ్యోతిర్మయి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో మండల, గ్రామ స్థాయి సిబ్బంది ద్వారా కొత్త పనులు ప్రతిపాదించి గ్రామ సభల ద్వారా ఆమోదం పొందేందుకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం మండల కంప్యూటర్ సెంటర్‌కు మండల అధికారుల ద్వారా గుర్తించిన పనులు, నివేదికలను పైఅధికారులకు సమర్పించిన అనంతరం మంజూరు చేస్తారన్నారు. గ్రామ స్థాయిలో ఒక రోజు ముందు దండోరా వేయించాలన్నారు. ఉపాధి కూలీలు, మేట్లు, మహిళా సంఘ సభ్యులు, రైతు కూలీ సంఘ సభ్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామ సభకు విధిగా హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో కోరారు.

23న గ్రామ సభలు

గోకవరం, ఆగస్టు 20: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టవలసిన పనులను గుర్తించడంతో పాటు, సంవత్సరంలో వంద రోజులు పని దినాలు కల్పించేవిధంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఈనెల 23న మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పద్మజ్యోతి మంగళవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులకు సంబంధించి చేసే ప్రతిపాదనలు, తీర్మానాలకు ఈ గ్రామ సభలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సినీ నిర్మాత రామారెడ్డి పుట్టినరోజు

బిక్కవోలు, ఆగస్టు 20: కొంకుదురుకు చెందిన సినీ నిర్మాత, కొంకుదురు రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు రామారెడ్డి పుట్టినరోజును మంగళవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు గడ్డం నవీన్, నల్ల అప్పారావు, వినోద్, సినీ హీరోలు సుభాష్, సురేంద్రరెడ్డి, హేమంత్‌లు రామారెడ్డితో కేకు కట్ చేయించి తినిపించారు. కార్యక్రమంలో రామారెడ్డి స్నేహితులు దొర, లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి, పీవీ, సురేష్‌రెడ్డి, ఉమారెడ్డి, చిన బాబు, శేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, జగ్గాశ్రీను పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, ఆగస్టు 20: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జాంపేటలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు కాటం రవి ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంచారు. సీతంపేట పార్కులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జండా పంజా రోడ్డులో అరవ సుబ్బరాజు కాంప్లెక్స్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు బెజవాడ రంగారావు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ సిటీ ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, కొత్తూరు శ్రీనివాస్, బత్తిన చంద్రరావు, చింతాడ వెంకటేశ్వర్, తారకేష్, శారాద, లీలావతి, శిఖ బాలాజీ శర్మ, అబ్దుల్లా షరీఫ్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను తగ్గించొద్దు

రాజమహేంద్రవరం సిటీ,ఆగస్టు 20: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో జనరల్ బోగీల సంఖ్యను తగ్గించే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉండడం సరికాదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఈ సమస్యపై ప్రధాని మోదీతో మాట్లాడాలని అన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కడియం, ఆగస్టు 20: మండలం వేమగిరి గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు. అనంతరం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. మూడేళ్లకోసారి అమ్మవారిని ఊరిలోకి తీసుకువచ్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న అమ్మవారిని ఊరిలోకి తీసుకువచ్చి ఆనాటి నుంచి పూజలు నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహించి ఈనెల 21న అమ్మవారిని అత్తారింటికి సాగనంపుతారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

కోరుకొండ, ఆగస్టు 20: బూరుగుపూడి నుంచి మోటార్‌బైక్‌పై కోరుకొండ వస్తుండగా అయ్యన్న గళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బూరుగుపూడి దేవుడి మాన్యానికి చెందిన చోడి వీరబాబు(17)అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఎమ్మెల్యే కొవ్వొత్తుల ర్యాలీ



రాజానగరం, ఆగస్టు 20: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను నిరసిస్తూ స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రాజానగరంలో కొవ్వొత్తులతో ప్రదర్శన, ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పోలీస్‌స్టేషన్, బస్టాండ్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఘటనపై పలువురు మాట్లాడుతూ అఘాయిత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గట్టి రామ్‌భాస్కర్, డాక్టర్ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య విద్యార్థులు, కూటమి నాయకులు గళ్లా రంగా, సైతిన చల్లారావు, తోట రామకృష్ణ, వీరమహిళలు పాల్గొన్నారు.



ప్రతి గ్రామానికి గోదావరి జలాలు
ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
నేడు దేవరపల్లిలో జనసేన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం 8

రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీ బెటాలియన్



- సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్
- కమాండెంట్‌గా రామకృష్ణ నియామకం
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

రాజమహేంద్రవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) బెటాలియన్ స్థాపనకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరిలో కాకినాడ జిల్లా కేంద్రంగా 3వ ఏపీఎస్పీ బెటాలియన్‌ని చాలా ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. అయితే జిల్లాల విభజన తర్వాత..అత్యవసర భద్రతల రీత్యా రాజమహేంద్రవరంలో ఏపీఎస్పీ బెటాలియన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ బలగమైన సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ ఇక్కడ ఉంది. ఆ స్థావరానికి వెనుక ఉన్న ప్రదేశంలో ఆ మాదిరి రాష్ట్ర దళమైన ఏపీఎస్పీ ఏర్పాటుకు ఏపీ సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళగిరిలో ఏపీఎస్పీ 6వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా ఉన్న సీపీప రామకృష్ణకు రాజమహేంద్రవరంలోని 4వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రజా భద్రతకు ప్రజా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం రుజువైంది. బెటాలియన్‌లో సుమారు 6 కంపెనీలు ఉంటాయి. ఒక్కో కంపెనీలో 120 మంది వరకూ సుశిక్షితులైన సిపాయిలు ఉంటారు. శాంతి భద్రతలకు విపత్కర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో వారిని వినియోగిస్తారు. కేంద్ర బలగమైన సీఆర్‌పీఎఫ్ ఉన్నా.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలంటే పెద్ద ప్రక్రియ ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ విభాగమైన అంతర్గత భద్రత విభాగానికి లేఖ రాయాలి. వారు పరిస్థితులను అంచనా వేసి అనుమతిస్తారు. ఈలోపు పుణ్య కాలం గడిచిపోతుంది. దీంతో ఆ సిబ్బంది మాదిరిగానే శిక్షణ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వాలు దళాలను ఏర్పాటు చేసుకున్నాయి. వీరు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు సులభంగా ఆదేశాలిచ్చి మోహరించడానికి వీలు కలుగుతుంది. కేంద్ర బలగాల మాదిరిగానే వీరికి అధునాతన ఆయుధాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో ఏపీఎస్పీ సేవలు కీలకం కానున్నాయి.



వెలుగుబంద లేఅవుట్‌లో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

రాజానగరం, ఆగస్టు 20 : పేదల కోసం ప్రభుత్వం తలపెట్టిన గృహ నిర్మాణాలను త్వరితగతిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని వెలుగుబంద గ్రామ శివారులో లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహ నిర్మాణ లేఅవుట్‌ను మంగళవారం సందర్శించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. దీంతో గృహ నిర్మాణాలకు సంబంధించిన ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ విన్నవించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్ఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు హౌసింగ్ పీడీ ఆర్.కృష్ణనాయర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకర్రావు, డీఈ సూరిబాబు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



చదువుకు.. వయసుతో పనేంటి!

38వ డిగ్రీ పొందిన డాక్టర్ రామారెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 20: మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డికి మరో పేరుంది. అదే నిత్య విద్యార్థి.. ఎందుకంటే ఆయన ప్రస్తుతం 38వ డిగ్రీ అందుకున్నారు. చదువుకు వయసుతో పనిలేదని మరో సారి నిరూపించారు. ఇటీవల ఐఐటీ రూర్కెలాలో సర్టిఫికెట్ ఇన్ బాడీ లాంగ్వేజ్ కోర్సు పూర్తి చేసి 38వ డిగ్రీ అందుకున్నారు.ఈ మేరకు మంగళవారం ప్రకాష్ నగర్‌లోని మానస హాస్పిటల్‌లో అరసం సభ్యులు ఘనంగా సత్కరించారు. అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ డాక్టర్ కర్రి రామారెడ్డి 38 డిగ్రీలు సాధించడం ఎంతో మందికి స్ఫూర్తి అన్నారు. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ నా దైనందిన జీవితంలో ఎప్పటికప్పుడు కొత్తవాటిని నేర్చుకోవడంలో ఒక భాగంగా భావించడమే ఇన్ని డిగ్రీలు చేయడానికి దోహదపడిందన్నారు.అనంతరం పడాల వీరభద్రరావు రచించిన అల్లూరి సీతారామరాజు వాస్తవ గ్రంథాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎస్ఆర్.పృథ్వీ,సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు, టీహెచ్.రమాదేవి, వీవీటీ.సంజీవరావు, మల్లెమొగ్గల గోపాలరావు పాల్గొన్నారు.

పీఎఫ్ కార్యాలయం ఎదుట ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 20 : తమకు కనీస పింఛను మొత్తం ప్రతినెలా రూ.9 వేలు చెల్లించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు మంగళవారం రాజమహేంద్రవరంలోని పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం పీఎఫ్ కార్యాలయ అధికారులకు ఒక వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కొండలరావు మాట్లాడుతూ ఆర్టీసీలోని అన్ని కేడర్ల రిటైర్డు ఉద్యోగులకు కనీస పింఛను రూ.1,000లు, గరిష్ట పింఛను రూ.2 వేలు మాత్రమే ఉందని అన్నారు. పెరిగిన కుటుంబ ఖర్చులు, వైద్య సమస్యల కారణంగా రిటైర్డు ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో అర్హులైన పింఛనుదారులకు పింఛను మొత్తం పెంచాలన్నారు. అలాగే ప్రతి ఏటా డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.



కనీస పింఛను పెంచాలని పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

వచ్చే నెల 5 వరకు ఈ-పంట నమోదు

కొవ్వూరు, ఆగస్టు 20 : జిల్లాలో ఈ పంట నమోదు సెప్టెంబరు 5వ తేదీ నాటికి 100 శాతం పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ ఎస్.చినరాముడు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ సంఘాలు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు.ఖరీఫ్ 2024కు సంబంధించి జిల్లాలో ఈ పంట నమోదు 96,571 ఎకరాల్లో పూర్తిచేశారన్నారు.పంట నమోదును ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. జిల్లాలో వ్యవసాయ సాగు విస్తీర్ణం 1,72,494 ఎకరాలు, ఉద్యాన సాగు విస్తీర్ణం 1,37,759 ఎకరాలు ఉందన్నారు. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం 3,10,253 ఎకరాల అన్నారు. ఈ పంట నమోదుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. సాగు ధ్రువీకరణ పత్రాలు అవసరమైన రైతులకు వీఆర్వోలు వెంటనే అందించేలా తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. కెఆర్సీ డిప్యూటీ కలెక్టర్, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 30 వేల హెక్టార్ల భూమిలో పంట సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ఈ నెల 3వ వారంలో జరిగే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనే విధంగా చైతన్యం కల్పించాలన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ కార్యాలయాలకు ఎలుకల మందు చేరవేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పి.విజయభాస్కర్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు, మండల తహశీల్దార్లు రేషన్ దుకాణాలను తనిఖీచేసి నివేదికలు సమర్పించాలన్నారు. అక్రమ నిల్వలు, పీడీఎస్ రైస్ కొనుగోలు చేయకుండా నిఘా పెట్టాలన్నారు.కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి టి.రాధిక,ఉద్యానశాఖాధికారి బి. సుజాత కుమారి, కొవ్వూరు డివిజన్ తహశీల్దార్లు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షలో జేసీ చినరాముడు



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చినరాముడు

అంతా.. మా ఇష్టం!



రద్దీగా ఉండే పుష్కరఘాట్, జీజీహెచ్ వద్ద పుష్కర్‌కేఫ్‌లు

నగరంలో అత్యంత రద్దీగా ఉండే కోటిపల్లి బస్టాండ్ సెంటర్, జీజీహెచ్ వద్ద ఏర్పాటు చేసిన పుష్కర కేఫ్‌లు



- గత పాలకుల ఇష్టారాజ్యం
- రద్దీ ప్రాంతాల్లో 4 పుష్కరకేఫ్‌లు
- షాపులకు టెండర్ పిలిస్తే వండర్
- ఒకే ఒక్క టెండర్ నమోదు
- వారికే కట్టబెట్టిన అధికారులు
- ఒక్కో షాపు అద్దె నెలకూ రూ.6250
- ఏడాదికి రూ.75 వేలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- విస్తుపోతున్న వ్యాపారులు
- మాకూ కావాలంటూ డిమాండ్

వడ్డించేవాడు మన వాడైతే..అడ్డేముంటుంది.. అక్రమమైనా సక్రమంగానే సాగిపోతోంది.. రోడ్డు మధ్యలో దుకాణం పెట్టేయవచ్చు.. సాఫీగా వ్యాపారమూ చేసుకోవచ్చు. అయినా అడిగే అధికారీ ఉండడు.. పట్టించుకునే పాలకులు ఉండరు.. గత ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరంలో జరిగిన ఒక ఒప్పందమే అందుకు ఉదాహరణ. నగరంలో నలుదిక్కులా పుష్కరకేఫ్‌లు వెలిశాయి.. రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే వీటిని ఏర్పాటు చేసేశారు.. ఒక్కో షాపునకు నెలకూ అద్దె ఎంతో తెలుసా కేవలం రూ. 6250 మాత్రమే.. ఇంత తక్కువ అద్దెకు అంత రద్దీ ప్రాంతాల్లో షాపులు ఎలా వెలిశాయనేది వైసీపీ పాలకులకే ఎరుక.. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలోనే ఇవి ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో వీటి లెక్కతేల్చనున్నారు.

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20 : రాజమహేంద్రవరం నిత్యం రద్దీగా ఉంటుంది..అడుగు తీసి అడుగు వేయాలన్నా కష్టమే. అంత ట్రాఫిక్ ఉంటుంది.ఎందుకంటే ప్రధాన వాణిజ్య కేంద్రం కావడంతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి జనం వచ్చివెళుతుంటారు. దీంతో నిత్యం రద్దీగానే ఉంటుంది. ప్రతి రోజూ వేలాది మంది వచ్చి వెళుతుంటారు. అటువంటి రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సింది పోయి.. గత పాలకులు ట్రాఫిక్ సమస్యను పెంచారు. నగరంలో నిత్యం రద్దీగా ఉండే కొన్ని ప్రాంతాల్లో గత ప్రజాప్రతినిధి, అధికారులు కలిసి చేసిన అనాలోచిత నిర్ణయాలకు ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. 2023లో అప్పటి ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో కొంత మంది అధికారులు చాలా అతిగా వ్యహరించి నగరంలో సమస్యలకు కారణమయ్యారు.

రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాపులు

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే దానికి ఇదో ఉదాహరణ. ఇప్పటి వరకూ ఎక్కడైనా పాలకులు అడిగితే ఉన్నతాధికారులు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వడం చూశాం. అయితే రాజమహేంద్రవరంలో మాత్రం ఏకంగా రోడ్లు.. ప్రభుత్వ స్థలాలనే తాకట్టు పెట్టేశారు. ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో తెలియదు కానీ కోటిపల్లి బస్టాండ్, తాడితోట జంక్షన్, పుష్కరఘాట్, జీజీహెచ్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాపులకు అనుమతులు ఇచ్చేశారు. ఆయా ప్రాంతాల్లో పుష్కర కేఫ్ పేరుతో నాలుగు షాపులను ఏర్పాటు చేశారు. ఈ షాపులకు నగరపాలక సంస్థ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారోనని జనం విస్తుపోతున్నారు.

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు..

ఉదయం సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంతాలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతాయి.ఒక బైక్ అడ్డం వస్తే చాలు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. అటువంటి రద్దీ ప్రాంతాల్లో పుష్కర్‌కేఫ్‌లు ఏర్పాటు చేయడం చూసి ఇక్కడెలా సాధ్యమైందని జనంఆశ్చర్యపోతున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఏదైనా సాధ్యమే కదా.అభివృద్ధి పేరుతో చేసిన అక్రమాల్లో ఇదొక ఉదాహరణ.ఈ పుష్కర కేఫ్‌ల కారణంగా ఇప్పుడే ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. 2027లో పుష్కరాలు రాబోతున్నాయి. అప్పటికే ఇవి అడ్డుగా ఇలాగే ఉంటే మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇకనైనా కూటమి నాయకులు కళ్లు తెరవాలి. టెండర్ వండర్‌ను బయటకు లాగి భరతం పట్టాలి. కూటమి నాయకులు దృష్టి పెట్టి అక్రమాలను వెలికితీయాలని పలు వురు డిమాండ్ చేస్తున్నారు.

పుష్కరకేఫ్‌లను పరిశీలిస్తా..



ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం. తొలగింపు తప్పదు. పుష్కర కాఫీ స్టాల్స్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతాం. పుష్కరాలకు సంబంధించి విభాగాల వారిగా సబ్ కమిటీ వేశాక చర్యలు ఉంటాయి. నగర అభివృద్ధి ప్రధానం అందుకు యాక్షన్ ప్లాన్ ఉంది.

- కేతన్ గార్గ్, కమిషనర్, రాజమహేంద్రవరం

టెండర్ పిలిస్తే.. ఒక్కటే వచ్చిందట?

ఎవరో కానీ నగరం అంతా ఆక్రమించేయడానికి ప్లాన్ వేశా రు. మొత్తం పది చోట్ల షాపులను ఏర్పాటు చేసుకునేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎప్పుడు పిలిచారో.. ఎక్కడ పిలిచారో కానీ ఆన్‌లైన్ టెండర్ పిలిస్తే విచిత్రంగా ఒక్క విజన్ మార్కెటింగ్ ఏజెన్సీ ఏజెన్సీ మాత్రమే టెండర్ వేసింది. ఎటువంటి పోటీ లేకుండా నాలుగు షాపులకు నగరపాలక సంస్థ ఒకే చెప్పేసింది. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయి. దుకాణాలను నిర్మించుకుని వాటిని మూడేళ్ల పాటు ఏడాదికి ఒక్కొక్క దుకాణానికి రూ.75 వేలు లీజు ప్రాతిపదికన చెల్లించేలా ఒప్పందాలు జరిగిపోయాయి. ప్రస్తుతం పుష్కర కేఫ్‌లు ఉన్న కూడళ్లలో షాపులు దొరకడమే గగనం. ఆయా కూడళ్లలో సగటు మార్కెట్ రేటు చూస్తే పుష్క రోకేఫ్ విస్తీర్ణం ఉన్న ఒక షాపు నెలకు రూ.లక్ష ఉంటుంది. కానీ నగరపాలక సంస్థ అధికారులు కళ్లు మూసుకున్నారో.. చెవులకు వినబడలేదో ఏమో కానీ ఏడాదికి కేవలం రూ.75 వేలకే లీజుకు ఇచ్చేశారు. అంటే నెలకూ ఎంతో తెలుసా కేవలం రూ.6250. ఈ విషయం తెలియడంతో రద్దీ ప్రాంతాల్లో తాము టెండర్లు వేసుకుంటాం. నగరపాలక సంస్థ షాపులు కేటాయించాలని స్థానిక వ్యాపారులు డిమాండ్ చేయడం గమనార్హం.ఈ దుకాణాలు ఇప్పుడు ఒక్కొక్క దుకాణం నెలకూ రూ.30 వేలు చొప్పున సబ్ లీజుకు ఇచ్చినట్టు తెలిసింది.

ఆక్రమణల.. భరతం పడతారా!

పట్టణాల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.. ఖాళీ జాగా కనిపిస్తే ఒట్టు రోడ్డయినా వదలడంలేదు.. దర్జాగా ఆక్రమించేస్తున్నారు.. అయినా ఎందుకో మరి అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు.. గతంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించాలంటేనే భయపడేవారు.. ఇప్పుడదేం లేదు.. ప్రభుత్వ స్థలమైనా పక్కా భవనాలు కట్టేస్తున్నారు.. ఇక రాజమహేంద్రవరం వంటి రద్దీ మార్కెట్లలో అయితే మరీ దారుణం. గజం జాగా ఖాళీగా ఉన్నా తెల్లారేసరికి అంతే.. దీంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడంలేదు. రాజమహేంద్రవరం కాతేరు రోడ్.. అనపర్తిలోని ప్రధాన రోడ్డు ఇందుకు ఉదాహరణ. ఇకనైనా అధికారులు ఆక్రమణల భరతం పడతారేమో వేచి చూడాల్సిందే!

పేపర్‌మిల్లు రోడ్‌లో నిత్య నరకం!



కాతేరు రోడ్‌లో రెండు బస్‌లు వస్తే ఇరుకైపోయిన రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 20 : రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో మల్లయ్యపేట, పేపరుమిల్లు పెట్రోల్ బంక్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపో యాయి. దీంతో అటుగా లారీలు, బస్సు లు, ఇతర భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. కనీసం కారులోనూ వెళ్లడం కష్టంగానే ఉంది. ముఖ్యంగా ఉదయం సాయంత్రం వేళలో స్కూల్, కాలేజీ బస్సులు, పేపరుమిల్లు లారీలు ఇతర వాహనాలతో రోడ్డు బ్లాక్ అవుతుంది. రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి మీదుగా కొవ్వూరు వైపునకు భారీ వాహనాలకు అనుమతులు నిలుపుదల చేసినప్పటి నుంచి ఆర్‌టీసీ బస్సులు, ఇతర వాహనాలన్నీ పేపరుమిల్లు, కాతేరు రోడ్డు మీదుగా నాల్గో బ్రిడ్జి గుండా విజయవాడ జాతీయ రహదారిపైకి వెళుతున్నా యి. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్‌టీసీ , ప్రైవేట్ బస్సులు అన్ని కాతేరు,పేపరుమిల్లు మీదుగానే రాజమహేంద్రవరంలో ప్రవేశిస్తున్నాయి. కాతేరు నుంచి పేపరుమిల్లు వరకు ఉన్న రోడ్డు ఇరువైపులా అక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. మల్లయ్యపేట నుంచి పేపరుమిల్లు గేటు వరకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం భారీగా ట్రాఫిక్ నిలుస్తుంది. పేపరుమిల్లు పెట్రోల్ బంక్ సెంటర్ ప్రమాదభరితంగా మారింది. అక్కడ రోడ్డుకు ఇరువైపులా కలప లారీలు నిలుపుదల చేస్తుండడంతో ఇబ్బందులు తప్ప డం లేదు. కాతేరు -పేపరుమిల్లు రోడ్డులో తరచు ప్రమాదాలు జరుగుతున్నా.. ట్రాఫిక్ జామ్ అవుతున్నా కనీసం ఏ ఒక్కరూ కన్నెత్తి చూడడంలేదు.

అనపర్తిలో రోడ్డునూ వదల్లేదు..



అనపర్తిలో రోడ్డు మధ్యనే ఆక్రమణలు

అనపర్తి, ఆగస్టు 20 : ఖాళీగా కనబడిందా ఆక్రమించెయ్.. ట్రాఫిక్‌కు ఇబ్బంది అవు తున్నా మనకేం పని.. మన వ్యాపారం మనదే.. ప్రస్తుతం అనపర్తి మెయిన్‌రోడ్డులో ఇదే పరిస్థితి. గతంలో పాలకులు అనపర్తి మెయిన్‌రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. స్థానిక ఐఎల్‌టీడీ సౌజన్యంతో సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారుల కోసం సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇదంతా గతంలో జరిగిన ఏర్పాటు..అయితే ప్రస్తుతం అనపర్తి మెయిన్‌రోడ్డులో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సెంటర్ పార్కింగ్ స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించుకుని భారీ దుకాణాలు ఏర్పాటు చేయడంతో పార్కింగ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపులకు వచ్చే కస్టమర్లు సెంటర్ పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం లేక షాపుల ముందే బైక్‌లను పార్కింగ్ చేసుకుని షాపులకు వెళుతున్నారు.దీంతో కనీసం మోటారు సైకిల్ వెళ్లే వీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.చిరు వ్యాపారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మెయిన్‌రోడ్డు వ్యాపారులు సమస్య పరిష్కా రంపై చర్చిం చేందుకు బుధవారం వర్తక సంఘ కల్యాణ మండపంలో సమావేశం కానున్నారు. పార్కి ంగ్ సమస్యపై చర్చించి అధికారులు,నాయకులకు వివరిస్తామని వ్యాపారులు చెపుతున్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రాజీవ్‌గాంధీ జయంతి



పెరవలి: ఖండవల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అరుణకుమారి

కొవ్వూరు, ఆగస్టు 20: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం కొవ్వూరులో నిర్వహించారు. మెయిన్ రోడ్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజి, పొల్నాటి చిన బాబు, నేతల ప్రసాద్, డేగల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కుమారి, కార్యకర్తలు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుద్దన లక్ష్మణరావు, పెచ్చెట్టి కోటేశ్వరరావు, కౌలూరి వీర బ్రహ్మం పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై పునః సమీక్షించాలి

మాలమహాసభ జాతీయ కన్వీనర్ రవిప్రకాష్

కొవ్వూరు, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని మాలమహాసభ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. కొవ్వూరు మెరకవీధి 4వ వార్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాల సంఘాల జేఏసీ, మాలమహాసభ సంయుక్త ఆధ్వర్యంలో మాలమహాసభ పట్టణాధ్యక్షుడు తరిపే బంగారయ్య అధ్యక్షతన వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. రవిప్రకాష్ మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణ చేసే అధికారం పార్లమెంటు ద్వారా జరగాలే తప్ప, రాష్ట్రాలకు లేదన్నారు. వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్‌బంద్‌ను అన్ని రాజకీయ పక్షాలు, దళిత సంఘాలు శాంతియుతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాసా ఆనంద్, సాకా పుల్లారావు, వారా రాజు, కె. నాగేశ్వరరావు, ఎం. రామకృష్ణ, పి. చిన అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

కొవ్వూరు, ఆగస్టు 20: కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.సతీష్ తెలిపారు. కళాశాలలో మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఎమ్మెస్సీ మ్యాథ్స్, కెమిస్ట్రీ, బీటెక్ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు 24న బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమోక్లాస్‌కు హాజరు కావాలన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీగా చేసి రిటైర్డ్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 08813-297668 నెంబరులో సంప్రదించాలన్నారు.

గోపాలపురం: గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంగ్లీష్, జంతు శాస్త్రానికి సంబంధించి గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రఫీద్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు తన సర్టిఫికెట్‌లతో ఈ నెల 22వ తేదీ ఉదయం 11గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు.

మానవత ఆవిర్భావ దినోత్సవం

గోపాలపురం, ఆగస్టు 20: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత సంస్థ ముఖ్య ఉద్దేశమని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం కార్యక్రమంలో మానవత రాష్ట్ర సభ్యులు బలుసు సత్యనారాయణ, జొన్నలగడ్డ రాంబాబు, గడా జోగేంద్రప్రసాద్, పప్పు సత్యకృష్ణారెడ్డి, రాపాక ఫణికిషోర్, కుక్కల కీర్తికుమార్ పాల్గొన్నారు.

చాగల్లులో శాంతి ర్యాలీ



చాగల్లులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

చాగల్లు, ఆగస్టు 20: చాగల్లులో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ, కేరళ వరద మృతుల ఆత్మలకు చేకూరాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, చాగల్లు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జనసేన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం

దేవరపల్లి, ఆగస్టు 20: గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని జనసేన ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించనున్నట్టు ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు తెలిపారు. దేవరపల్లిలో మంగళవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవరపల్లిలోని కాకర్ల కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, నర్సాపురం ఎమ్మెల్యే నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులను సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయుడు దుర్గాప్రసాద్, వై.రాజు, కంబాల సత్తిబాబు, అనిశెట్టి గంగరాజు, పసుపులేటి శివనాగప్రసాద్, బీ.గణపతి, దాసరి శేషారావు, రుద్రశ్రీనివాస్ పాల్గొన్నారు.

కోట సత్తెమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



వేదాశీర్వచనాలు అందుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

నిడదవోలు, ఆగస్టు 20: తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మతల్లిని మంగళవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలు అందించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

వైసీపీకి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీనామా



దేవరపల్లి, ఆగస్టు 20: వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు యర్నగూడెం గ్రామానికి చెందిన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల కనకరాజు మంగళవారం తెలిపారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం క్రియాశీలకంగా ఉండి, ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2014లో వైసీపీలో చేరి యర్నగూడెం సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పూర్తి వైఫల్యం చేదడంతో కనకరాజు తెలిపారు.

వైసీపీ నాయకుడు నరేష్‌పై కేసు

కారును అడ్డగించి వాగ్వాదం.. మహిళ ఫిర్యాదు

నల్లజర్ల, ఆగస్టు 20: మండలంలోని ప్రకాశరావుపాలెంలో మహిళతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకుడు ముత్తిన నరేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపారు.కొయ్యలగూడెం గ్రామానికి చెందిన యాగంటి రమాదేవి తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి పెదతాడేపల్లి ఫంక్షన్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ప్రకాశరావుపాలెం కూడలి వద్దకు వచ్చేసరికి ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ముత్తిన నరేష్ బైక్‌పై వెళ్తూ వెనుక నుంచి వచ్చే రమాదేవి కారుకు దారివ్వలేదు. పలుమార్లు హారన్ కొట్టడంతో కారును అడ్డగించి రమాదేవితో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

23న ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశం

ఉండ్రాజవరం, ఆగస్టు 20: నిడదవోలులో ఈనెల 23న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా సమావేశం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు మాదిగ మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌ఛార్జి ముమ్మిడివరపు చినసుబ్బారావు విచ్చేస్తారని చెప్పారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రతి గ్రామానికి గోదావరి జలాలు

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు మెయిన్ వాటర్‌వర్క్స్ పరిశీలన



ఇన్‌టెక్ వెల్ నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 20: నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణ, మండల, చాగల్లు, తాళ్లపూడి మండలాలకు గోదావరి జలాలను అందించడానికి ఇరిగేషన్, పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కొవ్వూరు మున్సిపల్ మెయిన్ వాటర్‌వర్క్సులో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు గోదావరి జలాలు అందించే ఆర్‌డబ్ల్యుఎస్ తాగునీటి పథకాల ఇన్‌టెక్ వెల్ నిర్మాణాలకు క్లియరెన్సు అందిస్తామన్నారు. పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ ఎ.సుధాకర్ మాట్లాడుతూ కొవ్వూరు మున్సిపాల్టీలో గోదావరి జలాలను అందించడానికి ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేశామని, ఇన్‌టెక్ వెల్ నిర్మాణం, ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ నిర్మాణానికి స్థలం పరిశీలించామన్నారు. ప్రభుత్వం ఏఐఐబీ నిధులు రూ.58 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ మాట్లాడుతూ రూరల్ వాటర్ సప్లయి కింద నియోజకవర్గంలోని కొవ్వూరు, చాగల్లు మండలాల్లో 14 ఎంఎల్‌డీ ప్లాంట్స్‌తో ప్రపోజల్స్ పెట్టామని, దానికి సంబంధించి ఇన్‌టెక్ వెల్, ట్రీట్‌మెంటు ప్లాంట్ల కోసం స్థలం పరిశీలనకు వచ్చామన్నారు. వెల్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. రూరల్ వాటర్ ప్లాంట్ నిమిత్తం ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్మాణానికి కొవ్వూరు మున్సిపల్ వాటర్‌వర్క్సులో ఐదెకరాలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి జలాలను వాటర్‌వర్క్సుకి డంప్ చేసి అక్కడ శుద్ధి చేసి పట్టణం, మండలానికి పంపిణీ చేస్తారన్నారు. పట్టణానికి రూ.58 కోట్లు, రూరల్‌లో కొవ్వూరు, చాగల్లు మండలాలు, తాళ్లపూడి మండలంలో కొన్ని గ్రామాలకు సంబంధించి రూ.96 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంపి పురందేశ్వరికి పంపించామన్నారు. పట్టణానికి మూడెకరాలు, మండలానికి ఐదెకరాలు భూమి అవసరం కాగా మున్సిపాల్టీ నుంచి అనుమతులు తీసుకుని ఆర్‌డబ్ల్యుఎస్‌కు అందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా మున్సిపాల్టీ పనులు మొదలుపెడతామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల సమయానికి తాగునీటి పథకాలు పూర్తికావాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, వివిధ ప్రభుత్వశాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిందితులను బహిరంగంగా ఉరితీయాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహర్షి



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొవ్వూరు, ఆగస్టు 20: కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మహర్షి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొవ్వూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మహర్షి మాట్లాడుతూ కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కళాశాల హస్పిటల్‌లో ట్రైనీ జూనియర్ డాక్టర్ అభయపై అత్యంత పాశవికంగా, కర్కశంగా, మానవ మృగంలా దాడిచేసి హత్య చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. హత్యకు కారకుడైన సంజయ్‌ను కఠినంగా శిక్షించి, బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. దేశంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ, దిశ, పోక్సో చట్టాలను పటిష్టంగా అమలుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వినోద్, కె.సుశీల, జె.ఉష, కె.మహాలక్ష్మి, ఆర్.సత్య, ఎస్.జాహ్నవి, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరులో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక మాట్లాడుతూ కోల్‌కతాలో మృతిచెందిన పీజీ వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలన్నారు. సామూహిక అత్యాచారం చేసి చంపేస్తే ఆత్మహత్యగా చిత్రీకరించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదులో పోలీసుల తీవ్ర అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారన్నారు. మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక విచారణ సంస్థను ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో మార్తా, రమాదేవి, సరిత, కుమారి, మేరమ్మ, సత్య, పార్వతి పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తాళ్లపూడిలో బస్టాండు సెంటరు నుంచి గడియారం సెంటరు వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌వో జోడాల మాట్లాడుతూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారికి అరబ్ దేశాల్లో వలె శిరచ్ఛేదనం వంటి కఠిన శిక్షలు అమలు చేస్తే మరో దుర్ఘటన జరుగకుండా ఉంటుందన్నారు. ప్రతి తల్లి దండ్రులు ఆడపిల్లలకు జాగ్రత్తలు చెప్పడమే కాక మగపిల్లలను బాధ్యతగా పెంచాలన్నారు. ఉపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు, విద్యార్థినుల పట్ల జరుగుతున్న దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు శాఖల మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెత్త సేకరణపై క్షేత్రస్థాయి పరిశీలన

సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ



నల్లజర్ల: దూబచర్లలో చెత్త సేకరణపై అవగాహన చేస్తున్న ట్రైనర్

నల్లజర్ల, ఆగస్టు 20: చెత్తను సేకరించి దానిని తడి, పొడి చెత్తగా వేరు చేసి, దాని నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానంపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ట్రైనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పంచాయతీలు సంపద సృష్టిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెత్తతో సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా వర్మీ కంపోస్టు,ప్లాస్టిక్ వంటి వాటిని విక్రయించి ఆదాయం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో బీ రత్నం,హరికృష్ణ పాల్గొన్నారు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డులో సర్పంచులు, కార్యదర్శులకు ఎంపీడీవో వెంకటరమణ అధ్యక్షతన చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలో చేపట్టి ఆదాయాన్ని పెంచుకునేలా ఆలోచన చేయాలని నిపలుసూచనలు చేసారు. పంచాయతీ క్లాప్ మిత్రలకు, స్వీపర్లకు షెడ్ల నిర్వహణ, తడ చెత్త, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీపై తాళ్లపూడి కార్యదర్శి ఆశాలేఖ్య శిక్షణ, అవగాహన కలిగించారు.

చాగల్లు: చాగల్లులో సంపద తయారి కేంద్రాలను సర్పంచులు, కార్యదర్శులు సందర్శించారు. డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజు మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్తలను వేరుగా సేకరించి వర్మీ కంపోస్టును తయారు చేయడం వల్ల పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందన్నారు. సమర్థవంతంగా నిర్వహిస్తే చక్కని ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, ఈవోపీఆర్డీ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. అనంతరం వేలివెన్నులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ గ్రామంలో సేకరించిన చెత్తను ఎలా వేరు చేస్తున్నది, వనరులు ఎలా పెంచుకోవాలో వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణంరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: వేలివెన్నులో చెత్తను వేరు చేయడాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- గోపాలపురం పశువైద్యాధికారి ధరిన్



గోపాలపురం: భీమోలులో ఆవుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

గోపాలపురం, ఆగస్టు 20: సీజనల్‌గా వచ్చే వ్యాధుల నిర్మూలనకు పశు సంవర్ధక శాఖ అందించే వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని పశువైద్యాధికారి ధరిన్ అన్నారు. మండలంలోని భీమోలు గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 15,000 పశువులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా ఆకలి మందగించడం, పాల దిగుబడి తగ్గడం, నోరు, కాళ్ల గిట్ల మధ్య పుండ్లు ఏర్పడుతుంటాయన్నారు. పశుసంవర్ధక శాఖ అందించే టీకాలను ప్రతి రైతు తమ పశువులకు వేయించాలన్నారు. మొదటి రోజు 150 పశువులకు టీకాలు వేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గంద్రోతు శ్రీనివాసరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక పశువైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు గ్రామాల్లో క్యాంప్‌లు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ఐదు నెలలు వయస్సు దాటిన దూడల నుంచి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. మండలంలో 6,900 పశువులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అతికాల శ్రీను, పిప్పర రవి, సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ ప్రమీల రాణి, సలాది శ్రీహరి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పొగాకు ట్రేలు అందజేత



దేవరపల్లి, ఆగస్టు 20: రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పొగాకు బోర్డు ప్రత్యేక చర్యలు చేపడుతుందని పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రైతులకు పొగాకు నాట్లు ట్రేలను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి హేమస్మిత మాట్లాడుతూ సబ్సిడీపై పొగాకు నాట్ల ట్రేలు అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. 45 వేల ట్రేలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దేవరపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

దేవరపల్లి/నల్లజర్ల, ఆగస్టు 20: ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దేవరపల్లి, నల్లజర్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు సాంబశివరావు, తెల్లం గంగాధర్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా మంగళవారం దేవరపల్లి, నల్లజర్లలో దోమల ద్వారా వచ్చే వ్యాధులను వివరిస్తూ వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి దోమల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ దోమలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూడలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్నామని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి వైద్యాధికారి సంజీవరావు, నల్లజర్లలో వైద్య ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్,సీహెచ్‌వో ప్రసాదరావు, షరీఫ్, సత్యనారాయణ, అన్నమ్మ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

నన్నయ ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 20: తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు ప్రయత్నించాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు దీక్షారంబ్ పేరుతో ఇండక్షన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగులుగా మాత్రమే కాకుండా గొప్ప ఇంజనీర్లుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుతున్న నాలుగేళ్లు దీక్షగా సాధన చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ నెల24 వరకూ ఇండక్షన్ కార్యక్రమం జరుగుతుందని, ఆఖరి రోజు రాజమహేంద్రవరంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి అవగాహన కల్పిస్తారని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వరస్వామికి విశేష పూజలు

ఉండ్రాజవరం, ఆగస్టు 20: ఉండ్రాజవరంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు.

బీఎల్‌వోల గౌరవ వేతన బకాయిలు ఇప్పించండి

తహశీల్దార్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి



తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఆగస్టు 20: బీఎల్‌వోలుగా పనిచేసిన తమకు గౌరవ వేతన బకాయిలు ఇప్పించాలని సచివాలయ ఉద్యోగులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్లుగా ప్రభుతత్వం నుంచి రావాల్సిన గౌరవ వేతనం సక్రమంగా రాకపోవడంతో ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నామని పేర్కొ న్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు లిస్టులు సవరణలు, క్లెయిమ్‌ల తయారీ, మార్పులు, చేర్పులు, ఆధార్ లింకింగ్, ఇంటింటికి సర్వే వంటి విధులు నిర్వహించామని, పని వేళలతో సంబంధం లేకుండా సెలవు రోజుల్లో సైతం విధులు నిర్వర్తించామన్నారు. గౌరవ వేతనం బకాయిల చెల్లింపు నకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తించిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాడపల్లికి పద్మశాలీల పాదయాత్ర

నిడదవోలు, ఆగస్టు 20: నిడదవోలులోని భద్రావతి సమేత భవనాఋషి దేవస్థాన పద్మశాలీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలం నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిడదవోలు నుంచి వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రను ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు జనసేన నాయకుడు డాక్టర్ తోపరాల కళ్యాణ్‌చక్రవర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో కందుల దుర్గేష్ నిడదవోలు ఎమ్మెల్యేగా అఖండ విజయంతో గెలుపొందితే నిడదవోలు నుంచి వాడపల్లికి పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నామని, ఆయన గెలుపొందడంతో ఈ పాదయాత్రను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు పాల్గొనగా ఈ పాదయాత్రలో పద్మశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

6 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొవ్వూరు, ఆగస్టు 20: సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కె.జగన్మోహన్ తెలిపారు. కొవ్వూరులోని ఔరంగాబాద్ సమీపంలో గోదావరి నది మధ్యలో గొంగూర లంకలో ఇసుక తిన్నెలపై సారా తయారుచేస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా 6000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల సారా, సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తయారీదారుడు రాజమహేంద్రవరం తాడితోటకు చెందిన దుర్గ పరారయ్యాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

కొవ్వూరు, ఆగస్టు 20: వ్యభిచార గృహంపై దాడిచేసి నిర్వాహకురాలిపై కేసునమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు రాజీవ్‌కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి నిర్వాహకురాలు చింతల లక్ష్మిని అరెస్టు చేశామన్నారు. ఇద్దరు మహిళలను విడిపించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని కారు ధ్వంసం

కొవ్వూరు, ఆగస్టు 20: లారీ ఢీకొని కారు ధ్వంసమైనట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. బూసిం వినయ్ మంగళవారం తుని నుంచి కారులో ఏలూరు వెళ్తుండగా మార్గమధ్యలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినడంతో వినయ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

ఢిల్లీ వేడుకల్లో జీఎస్ఎల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాజానగరం, ఆగస్టు 20: దేశ రాజధాని ఢిల్లీ రెడ్ ఫోర్టులో ఇటీవల నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని, తిరిగి వచ్చిన జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.వాణి మాధవి, విద్యార్థులు భాగ్యశ్రీ, సాహిత్ భరద్వాజ్‌లను జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అభినందించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	: మిస్టర్ బచ్చన్
వై.స్క్రీన్2	: తంగలన్
దేవిశ్రీ(గాయత్రి	: డబుల్ ఇస్మార్ట్
అనన్య	: ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	: మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	: ఆయ్, తంగలన్
శ్రీగణపతి	: డబుల్ ఇస్మార్ట్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	: డబుల్ ఇస్మార్ట్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	: ---
స్క్రీన్ 2	: ---
శ్రీనివాస	: ---